౨౦

# దైవలీల

అనగనగా ఒక ఊరిలో రామదేవ్ అనే కుమ్మరివాడుండే వాడు.

అతను పరమ శివభక్తుడు. ప్రతిరోజూ మట్టితో ఒక శివలింగాన్ని తయారుచేసి దానిని శ్రద్ధగా పూజించిన తర్వాతనే కుండలు చేయడం ప్రారంభించేవాడు. ఖాళీగా ఉన్నప్పుడు నిత్యమూ శివుణ్ణే ధ్యానిస్తుండేవాడు. సాయంత్రం శివాలయానికి పోయి దైవపూజలు చేస్తూండేవాడు.

అతనికి అన్నీ ఉన్నాయి కాని.., ఒక్కటే దిగులు! మట్టి కుండలు క్రిందపడితే తేలిగ్గా పగిలి పోతాయి. అవి అలాకాకుండా ఎంత గట్టిదెబ్బ తిన్నా పగలకూడదని కోరుకుంటుండేవాడు. అలా కావాలని శివుని నిత్యమూ ప్రార్థిస్తుండేవాడు కూడా.

ఒకరోజురాత్రి రామదేవ్‌కి శివుడు కలలో కన్పించి "భక్తా...నీకేం కావాలో కోరుకో!" అని అడిగాడు.

రామ్‌దేవ్ "స్వామీ.., నేను చేసిన కుండలు ఎప్పటికీ పగలకుండా ఉండేట్లు అనుగ్రహించు తండ్రీ..!" అని అడిగాడు.

శివుడు "బాగా ఆలోచించుకొని కోరుకో. తర్వాత బాధ పడకూడదు సుమా!" అని హెచ్చరించాడు.

రామదేవ్ "బాగా ఆలోచించుకునే కోరుకొంటున్నాను" అన్నాడు.

శివుడు ఆ విధంగా అనుగ్రహించి అంతర్ధానమయ్యాడు.

మర్నాడు ఉదయమే రామదేవ్- శివుని పూజించి కుండ చేశాడు. ఎండగానే దానిని బలంగా నేలకేసి కొట్టాడు. అది పగలలేదు. ఆ తర్వాత చేసిన ఏ కుండా కూడా పగలలేదు.

ఈ విషయం తెలిసి ఎక్కడెక్కడి ప్రజలూ ఎగబడి అతని కుండలు కొనుక్కుపోసాగారు. అచిర కాలంలోనే రామదేవ్ విశేష ధనవంతుడయ్యాడు.



అయితే... ఈ ముచ్చట ఎక్కువకాలం నిలవలేదు. రామదేవ్ చేసిన కుండలు పగలని కారణంగా ఒకసారి కొన్నవారు మళ్ళీ కొనడం మానేశారు. దాంతో రామదేవ్ పరిస్థితి దిగజారిపోయింది.

శివుని హెచ్చరికలోని అంతరార్థం అపుడు అర్థమయింది అతనికి. త్వరలోనే అతను బాగా పేదవాడయి కష్టాలు పడసాగాడు.

భక్తుని అవస్థను చూడలేక శివుడు మళ్ళీ కన్పించి "భక్తా... ఎలా ఉన్నావు?" అని అడిగాడు.

రామదేవ్ "ప్రభూ...నీ లీల అర్థంచేసుకోలేక ఆ విధంగా కోరాను. నా పొరబాటును గుర్తించాను. క్షమించు" అని వేడుకున్నాడు.

శివుడు క్షమించి "భక్తా...నా సృష్టిలో మంచీ,చెడూ రెండూ ఉంటాయి. చెడు లేనిదే మంచికి విలువ లేదు. ప్రతి పదార్థానికీ దాని ధర్మాలు ఉంటాయి. ఇంక ముందు నీ కుండలు పెనుకటివలనే పెళుసుగానే ఉంటాయి" అని అంతర్ధానమయ్యాడు.

అప్పటినుంచీ తిరిగి మామూలు జీవితం గడపసాగాడు రామదేవ్.

★★★